రైల్వే స్టేషన్లలో సమస్యల కూత

- ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం
- ఎక్స్‌ప్రెస్‌లు ఆపాలని కోరుతూ వినతులు
- పేదలకు అందని ద్రాక్షలా రైల్వే సేవలు
- ప్రజల ఇబ్బందులు పట్టని పాలకులు



భీమడోలు రైల్వే స్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫామ్ వరకు లేని ఫుట్‌పాత్ బ్రిడ్జి

భీమడోలు: భీమడోలు రైల్వే స్టేషన్ చుట్టూ సమస్యల కూత కూస్తున్నాయి. పేద, సామాన్య వర్గాలకు చేరువ కావాల్సిన రైల్వే శాఖ, వారికి అమడ దూరంలో నిలుస్తుంది. ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా ఉన్న ఈ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి, వసతుల కల్పనలో రైల్వే అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లపై చూపే శ్రద్ధ బ్రిటిష్ కాలం నాటి భీమడోలు రైల్వే స్టేషన్ పట్ల చూపడం లేదని బాహాటంగా విమర్శిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపకపోవడం, ఫుట్‌పాత్ బ్రిడ్జిను విస్తరించాలని, వసతులు కల్పించాలని ఏన్నో ఏళ్లుగా యాత్రికులు, భక్తులు వేడుకుంటున్నారు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు, భీమడోలు పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం ఈ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌ను ప్రయాణికులు, భక్తులు, సందర్శకులు, ఈ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేశారు.

హాల్ట్ ఎత్తివేత

జిల్లాలో చెన్నై–కోల్‌కతా రైలు మార్గం అందుబాటులో ఉండడం, పేదలు, మధ్య తరగతి వర్గాలకు తక్కువ వ్యయంతో ప్రయాణించే అవకాశం ఉండడంతో ఎక్కువ మంది ప్రయాణికులు రైళ్లలోనే ప్రయాణిస్తున్నారు. వాటితో పాటు భీమడోలు, దెందులూరు, ఉంగుటూరు మండలాల పరిధిలోని పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో ఒడిశాకు చెందిన కార్మికులు ఉన్నారు. అయితే భీమడోలు నుంచి గుంటూరు వెళ్లేందుకు రాయగడ ప్యాసింజర్ అనువుగా ఉంది. అదే విధంగా తిరుమల తిరుపతికి వెళ్లేందుకు కాకినాడ–తిరుపతి ప్యాసింజర్‌ను స్థాయిని పెంచి ఎక్స్‌ప్రెస్ చేసి హాల్ట్ ఎత్తి వేసి కొంటర్లకు స్వస్తి పలికారు. అదే విధంగా భీమడోలు రైల్వే స్టేషన్‌లో మూడు ప్లాట్‌పారమ్‌లు ఉండగా కేవలం రెండు ప్లాట్‌ఫారమ్‌లను దృష్టిలో ఉంచుకుని గతంలో నిర్మించిన ఫుట్‌పాత్ ఓవర్ బ్రిడ్జిని విస్తరించాలని కోరుతున్నారు.

వివక్ష చూపుతున్న రైల్వే శాఖ

ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రం సందర్శకులు, ఆదాయపరంగా ప్రత్యేక గుర్తింపు పొందింది. ద్వారకాతిరుమల దేవాలయానికి ప్రతి 20 రోజులకో సారి యాత్రికుల కానుకల రూపంలో రూ.3 కోట్ల ఆదాయం సమకూరుతుంది. అయినా భీమడోలు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి, ఇతర సౌకర్యాలపట్ల రైల్వే శాఖ వివక్ష చూపుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యాత్రికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పలు రైళ్లను నిలుపుదల చేసి, ప్రత్యేక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని యాత్రికులు కోరుతున్నారు. భీమడోలు రైల్వేస్టేషన్‌లోని విశ్రాంతి గదిలో యాత్రికులు కఠిన నేలపై నిద్రించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన చెందుతున్నారు. కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి కుర్చీలను కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.



భీమడోలు రైల్వే స్టేషన్‌లో కటిక నేలపై నిద్రపోతున్న యాత్రికులు (ఫైల్)



ఉంగుటూరు మండలంలోనే పెద్ద స్టేషన్ చేబ్రోలు రైల్వే స్టేషన్ ఇదే

స్టేషన్లు ఉన్నా ఆగని రైళ్లు

ఉంగుటూరు: స్టేషన్లు ఉన్నా ఆగని రైళ్లతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అందని ద్రాక్షలా రైల్వేసేవలు మారాయి. గ్రామాల మధ్య నుంచి రైళ్ల కూతలు భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నా అవసరానికి రైలు ఎక్కుదా మంటే 50 కిలో మీటర్లు ప్రయాణం చేస్తే గాని ఎక్కలేని పరిస్థితి గ్రామీణ ప్రాంత ప్రజలది. ఈ కాలంకన్నా బ్రిటిష్ కాలమే మేలని ప్రజలు వ్యాఖ్యానించుకునే పరిస్థితి ఉత్పన్నమైంది. ఉంగుటూరు మండలంలో బాదంపూడి, ఉంగుటూరు, చేబ్రోలు, కైకరం, రైల్వే స్టేషన్లు ఉన్నాయి. ఈ రైల్వే స్టేషన్లు దిష్టి బొమ్మల్లా కనిపిస్తున్నాయి. స్టేషన్ల మీద నుంచి రైళ్లు వెళుతున్నా ఒక్క రైలూ ఆపడం లేదు. ఒక్క చేబ్రోలులో మాత్రం విజయవాడవైపు వెళ్లే లైన్‌లో తెల్లవారుజామున 4.20గంటలకు రాజమండ్రి–విజయవాడ (నంబర్ 67261) రైలు ఆగుతోంది. కాకినాడ–విజయవాడ వెళ్లే రైలు (17258) ఉదయం 6.40కి ఆగుతోంది. రాజమండ్రి నుంచి విజయవాడ వెళ్లే రైలు (67201) రాత్రి 8 గంటలకు ఆగుతున్నాయి. రాజమండ్రి వైపు వెళ్లే రైళ్లలో విజయవాడ–రాజమండ్రి(67262) తెల్లారు జామున 5.15 గంటలకు ఆగుతోంది. విజయవాడ నుంచి కాకినాడ వెళ్లే (17257) రైలు రాత్రి 7.30 గంటలకు, విజయవాడ నుంచి రాజమండ్రి వెళ్లే రైలు (67202) రాత్రి 9.15 గంటలకు ఆగుతోంది. అయితే ఒక్క ఎక్స్‌ప్రెస్ రైలు కూడా స్టేషన్‌లో ఆగడంలేదు. ఇదిలా ఉండగా సింహాద్రి, తిరుమల, రాయఘడ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టు ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే స్టేషన్లు ఉండి రైళ్లు ఆగకపోవడంతో బాదంపూడి, ఉంగుటూరు, కై కరం ప్రజలు వేరే దారి లేక చేబ్రోలు వచ్చి ఇక్కడ ఆగుతున్న అరకొర రైళ్లలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. చేబ్రోలు రైల్వే స్టేషన్ జిల్లాకు నడి బొడ్డులో ఉంది. డెల్టాకు, మెట్టకు మధ్యస్తంగా ఉన్న ఈ స్టేషన్ సుమారు 10 లక్షల మందికి కేంద్ర బిందువుగా ఉంది. ఇక్కడ ఆగుతున్న రైళ్ల ఆదాయం పరిశీలిస్తే ప్రయాణికులు ఎక్కడి నుంచి వచ్చి వెళుతున్నారనేది రైల్వే శాఖ అధికారులకు అర్థమవుతోంది.

ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి



ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజులకు వినతిపత్రం అందించాం. రైల్లే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలని, కనీస వసతులు కల్పించాలని కోరాం. భీమడోలు రైల్వే స్టేషన్ వద్ద దిగిన ప్రయాణికులు, భక్తులు ద్వారకాతిరుమల వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఆర్టీసీ బస్సులను ద్వారకాతిరుమలకు వెళ్లే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కోరాం.

– ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, సామాజిక ఆరోగ్య కేంద్రం సభ్యుడు, భీమడోలు

సమస్యలను రైల్వే జీఎం దృష్టికి తీసుకెళతాం



భీమడోలు రైల్వేస్టేషన్‌లోని సమస్యలను రైల్వే జీఎం అరుణకుమార్‌కు వివరించాం. తనతోపాటు గ్రామ పెద్దలు కలిసి మూడు ట్రాక్‌లకు సరిపడేంత ఫుట్‌పాత్ వంతెనను నిర్మించాలని కోరాం. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరాం. ఫుట్‌పాత్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారిఇబ్బందులను అధికారుల దృష్టికితీసుకెళ్లాం. అభివృద్ధి, సమస్యలను పరిష్కరించాలని వేడుకున్నాం. సానుకూలంగా స్పందించారు.

– టీవీ ఉమామహేశ్వరరావు, మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు

చరిత్రాత్మక స్టేషన్ చేబ్రోలు



చేబ్రోలు చరిత్రాత్మకమైన స్టేషన్. తూర్పు ప్రాంతంలోని విజయనగరం, శ్రీకాకుళం ఒరిస్సా నుంచి ఇక్కడికి బంధుత్వాల ద్వారా ప్రజలు ఆ జిల్లాల నుంచి ఇక్కడికి తిరుగుతారు. దీంతో పూర్వం ప్యాసింజర్ రైలు ఎక్కి ఇక్కడికి రావడం వెళ్లడం అలవాటుగా మారింది. ఇప్పుడు వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు పరిశ్రమలు పెరగటంతో ఒరిస్సా, బెంగాల్ నుంచి వందలాది మంది ఈ ప్రాంత పరిశ్రమల్లో పని చేస్తున్నారు. ప్రయాణానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. చేబ్రోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టును ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– పుల్లేటికుర్తి బుల్లియ్య, చేబ్రోలు

ఎన్నో విజ్ఞప్తులు చేశాం.. ఫలితం శూన్యం



చేబ్రోలు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయమని, ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయమని ఎన్నో విజ్ఞప్తులు చేశాం. ఫలితం లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు లాభాపేక్ష లేకుండా కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎక్కువ టికెట్లు అమ్మడం లేదు. అందువల్లే ఎక్స్‌ప్రెస్‌లు ఆపడం లేదని చెబుతున్నారు. ఇది ఎంత వరకు సమంజసం. మెట్ట, డెల్టాలోని వందలాది గ్రామాలకు సెంటర్‌గా నిలిచిన చేబ్రోలు స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయమని కోరుతున్నాం.

– తుంపూడి వెంకటరత్నం, సామాజిక కార్యకర్త, చేబ్రోలు

క్లుప్తంగా

బస్సులను నిర్దిష్ట ప్రదేశంలో ఆపండి



ఎంపీడీవో రాజ్‌మనోజుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ బండారు నాగరాజు

ఉంగుటూరు: నారాయణపురంలో వంతెన కూలిపోయిన తరువాత ఆర్టీసీ బస్సులు నిర్దిష్టమైన ప్రదేశంలో ఆపకపోవడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారని నారాయణపురం ఎంపీటీసీ, ఎంపీటీసీ చాంబర్ మండల అధ్యక్షుడు బండారు నాగరాజు ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎంపీడీవో రాజ్‌మనోజుకు ఫిర్యాదు చేశారు. పలు గ్రామాల ప్రయాణికులు బస్సుల కోసం ఒక చోట నిలబడితే మరో చోట ఆపుతున్నారని, దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలా కాకుండా ఏదో ఒక నిర్దిష్టమైన ప్రదేశంలో బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని బండారు నాగరాజు కోరారు.

అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు



అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సుమతి

దెందులూరు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి అన్ని శాఖల ఉద్యోగులు సత్వరం చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.సుమతి ఆదేశించారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల మండల అధికారులు, వీఆర్‌ఓలు, దీఆర్‌ఏలు సర్వేయర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమస్యల పరిష్కారంలో ఎవరైనా నిర్లక్ష్యం వహించినా, అవాస్తవాలు నమోదు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగాపై సమీక్ష

దెందులూరు: స్వాతంత్ర ఉద్యమం పట్ల దేశభక్తి భావంపై ఈ నెల 15వ తేదీ వరకు మండలంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని తహసీల్దార్ బి.సుమతి అధికారులను ఆదేశించారు. సోమవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



విద్యార్థులకు సూచనలందిస్తున్న ఎస్సై

భీమడోలు: విద్యార్థి దశ నుంచి ప్రణాళికాబద్ధంగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీస్ శాఖ శక్తి టీం ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి యాప్ వలన కలిగే ప్రయోజనాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, పుస్తకాలను చదవాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తే సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై చలపతిరావు, హెచ్‌ఎం పద్మజ, టీచర్ సన్యాసిరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఆరుగురు ఎంపిక



కీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందించి అభినందిస్తున్న హెచ్‌ఎం జి.పద్మజ

భీమడోలు: జిల్లా స్థాయిలో ప్రతిభను కనబరిచిన ఆరుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో సోమవారం విజేతలైన క్రీడాకారులను హెచ్‌ఎం జి.పద్మజ అభినందించారు. వారికి పతకాలను, ప్రశంసా పత్రాలను అందించారు. 9 నుంచి 11వ తేదీ వరకు ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థా యి పోటీలకు ఎం.ఉమాలక్ష్మి, దాసరి జయశ్రీ లక్ష్మి, జె.యువసాయి నరసింహ, ఆదిత్య, పి.వరుణ్ గాంధీ, రాజేష్ అర్హత సాధించారన్నారు.

గణపవరం విద్యార్థుల ఎంపిక

గణపవరం: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అఖిల్ శ్రీవర్మ, యశోద కృష్ణ రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతూ మండల, జిల్లా, జోనల్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా బాపట్లలో రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారని పీడీ పద్మావతి తెలిపారు.

గురుకులంలో నూతన భవనం నిర్మించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఏలూరు (టూటౌన్): భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కూలిపోయిన గదులు స్థానంలో కొత్త గదులు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గదులు లేకపోవడంతో విద్యార్థులు డార్మెంటరీలోనే విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. తాత్కాలికంగా రేకుల షెడ్లు ఏర్పాటు చేసి విద్యా బోధన చేయాలని, డార్మెంటరీలో ఉన్న రిపేర్లు కూడా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మే నెలలో తర్వాత గదులు పడిపోతే పాఠశాల ప్రారంభమయ్యేంత వరకు పట్టించుకోలేదని మండిపడ్డారు. ఏలూరు ఎస్సీ బాయ్స్ కాలేజీ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న హాస్టల్‌లో విద్యార్థులు మత్తు పదార్థాలు అలవాటు పడ్డారని, ఎస్ఎఫ్ఐ గతవారం సాక్షాలతో సహా మీడియాకు అందజేసిందని తెలిపారు. అయినా అధికారులు ఇప్పటికీ స్పందించలేదని పేర్కొన్నారు. హాస్టల్‌లో మత్తు పదార్థాలు అలవాటు పడడానికి సహకరించిన హాస్టల్ వార్డెన్ పైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజూ కళాశాలకు వెళ్లకుండా దాదాపు 20 మంది వరకు హాస్టల్లోనే ఉంటున్నారని తెలిపారు. ఆశ్రం కాలేజీకి చెందిన ఒక ఎంబీబీఎస్ స్టూడెంట్స్‌కి ఒక రూమ్ ఎందుకు అంటూ ప్రశ్నించారు. సాయంత్రం పూట పోలీసు వారిని నిఘా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, అధ్యక్షుడు బి.మనోజ్, నగర్ కమిటీ సభ్యులు సూర్యభాను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ



నారాయణపురంలో సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహించిన సభ

ఉంగుటూరు: నారాయణపురంలో ఏడాది కాలంగా నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సర్పంచి దిడ్ల అలకానంద అధ్యక్షతన నిర్వహించిన సభలో జిల్లా రిసోర్సు పర్సన్ తిరుపతిరావు పాల్గొన్నారు. గ్రామంలో ఎన్ని వర్కులకు తేడా వచ్చిందో గుర్తించారు. గ్రామంలో పనులవద్దకు వెళ్లి తనిఖీ చేశారు. గ్రామ సభలో అభ్యంతరాలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటను పరిశీలిస్తున్న అధికారులు, ఏఎంసీ చైర్మన్

భీమడోలు: ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ప్రాజెక్టు అధికారి బాలిన వెంకటేష్ అన్నారు. కోడూరుపాడు, వడ్లపట్ల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సోమవారం రైతులకు తడి–పొడి వరి సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై వారికి అవగాహన కల్పించారు. రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు అధికారి బాలిన వెంకటేష్, భీమడోలు ఎఎంసీ చైర్మన్ శేషపు శేషగిరి మాట్లాడుతూ వరి సాగులో విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుమందులను వినియోగించడం వలన పంట విషతుల్యంగా మారుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబిస్తే నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించొచ్చన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. తొలుత ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న వరి సాగును వారు పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ మానుకొండ నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ దూసనపూడి పుల్లయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, ఏవో ఉషారాణి, పెద్దలు ఆదిరెడ్డి సత్యనారాయణ, యుగంధర్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో ప్రతిష్ఠించిన స్వామి వార్లు



స్వామి వార్లను దర్శించుకుంటున్న భక్తులు

దెందులూరు: గోపన్న పాలెం శ్రీకోదండ రామాలయంలో సోమవారం ఉదయం 8.10 గంటలకు భక్తి శ్రద్ధలతో వైభవంగా శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయ, గణేశ, సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణ, అయ్యప్పస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కోలాహలంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, యంత్ర ప్రతిష్ఠ, నవధాన్య పంచలోహ నవరత్నాలతో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవానికి గోపన పాలెంతో పాటు సమీప గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఏనుగు వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పలు గ్రామాల భక్తులు స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం అనంతరం మహా అన్న సమారాధన నిర్వహించారు.

ఫీవర్ సర్వేపై నిర్లక్ష్యం వహించొద్దు



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే పట్ల నిర్లక్ష్యం వహించొద్దని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అన్నారు. సోమవారం ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా గోపన్నపాలెంలో ఆయన మాట్లాడుతూ వాతావరణంలో ఏర్పడిన మార్పులు ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి కారణంగా జ్వరాలతో పాటు ఇతర అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వీటితో పాటు ఇంటింటికీ ప్రభుత్వ వైద్య సిబ్బంది వచ్చి ఫీవర్ సంక్రమిత వ్యాధులపై చేస్తున్న సర్వేలో సిబ్బందికి వాస్తవాలు తెలియజేయాలన్నారు. ఇళ్లలోని యజమానులు సర్వేకు వచ్చిన సిబ్బందికి పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. అనారోగ్యాన్ని దాచుకుంటే నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.

లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

భీమడోలు: పంచాయతీ పరిధిలోని పెదలింగంపాడులో లో ఓల్టేజ్ విద్యుత్ సమస్య వల్ల గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సమస్యను తక్షణమే పరిష్కారించాలంటూ భీమడోలు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ సోమవారం ఫిర్యాదు చేశారు. ఏలూరులో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఆయన కలెక్టర్ వెట్రిసెల్వికి లిఖితపూర్వక ఫిర్యాదు అందించారు. పెదలింగంపాడు గ్రామం పూర్తి దళిత గ్రామమని, ఇటీవల గ్రామం నుంచి విద్యుత్ శాఖ అధికారులు చేపల చెరువులకు కరెంట్ వైర్లు వేశారని, దీంతో గ్రామంలో కరెంట్ సమస్యకు శాశ్వత పరిష్కారమవుతుందని భావించామన్నారు. వేసిన తరువాత కరెంట్ సమస్య తీవ్రంగా మారిందని, పగలు రాత్రి వేళల్లో లో ఓల్టేజ్ సమస్యతో ఇంట్లో ఫ్యాన్లు తిరగడం లేదని, పిల్లలు, వృద్ధులు, రోగులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని, మా గ్రామానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

8న శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మకు సారె

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఈ నెల 8న వరలక్ష్మి వ్రతం పురస్కరించుకొని చీర, సారె సమర్పిస్తామని శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు.

ఎన్నికల హామీలను మర్చిపోవడం విడ్డూరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు

ఉంగుటూరు: ప్రజలకు ఇచ్చిన హామీలను మరచిపోవడం విడ్డూరంగా ఉందని, ప్రజల్లో తిరిగి తొలి అడుగు పేరుతో ఏ ముఖం పెట్టుకొని వెళుతున్నారని కూటమి నాయకులను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు ప్రశ్నించారు. సోమవారం ఎ.గోకవరం గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండ రవి కిరణ్ అధ్యక్షత వహించారు. కూటమి నాయకులు ప్రజలను మభ్యపెట్టడానికి తిరుగుతున్నారు తప్ప ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని మరడ మంగరావు విమర్శించారు. అమలు కాని హామీలు ఇచ్చి ఏడాది పాలన గడిపేయడం విడ్డూరంగా ఉందన్నారు. హామీల విషయంలో ప్రజలు కూటమి నాయకులను నిలదీయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం బాబు మోసాలపై క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావు బాబ్జి, పంచాయితీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, రాష్ట్ర మహిళా కార్యదర్శి మంద జయలక్ష్మి, సర్పంచి దిద్దే సత్యవతి, ఎంపీటీసీ దేవదాసు విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ విభాగం నాయకులు కొరిపల్లి శ్రీనివాసరావు, మిద్దే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రుద్రభూమిలో సౌకర్యాల కల్పన



రుద్రభూమి శీతల శవ పేటికను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి

ఉంగుటూరు: కై కరం గ్రామంలో రూ.11 లక్షల ప్రజల విరాళాలతో రుద్రభూమిలో సౌకర్యాలను ఏర్పాటు చేశారు. దీంతో జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి సోమవారం ఏర్పాటు చేసిన వాటిని ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ కూన అప్పారావు ఆధ్వర్యంలో దాతల సహకరంతో ఈ రుద్రభూమిలో ఎన్నో సౌకర్యాలు కల్పించారు. ఏలూరుకు చెందిన పూర్వ జ్ఞానానంద సరస్వతి మాతాజీ చిన్నయ మిషన్ విద్యా వైద్య న్యాయ సేవా కేంద్రం హస్తాలతో ఆధ్యాత్మికతతో ప్రారంభించారు. విశ్రాంతి షెడ్డును ఎంపీటీసీ పేద్ద చిన్న అప్పారావు, శీతల శవ పేటికను జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి ప్రారంభించారు. శీతల శవ పేటికను అమెరికాకు చెందిన డాక్టర్ సంపతి సతీష్ కుమార్ బహూకరించారు. కార్యక్రమంలో సర్పంచి సలగల గోపి, వీటి సంఘం అధ్యక్షుడు సంపతి వెంకటేశ్వరరావు, సమాజ సేవకులు కె.వీర్రాజు, కర్రి ముత్యాలరావు, ప్రధాన కార్యదర్శి లచ్చిరెడ్డి శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు కె.శ్రీనివాస్, కొత్తపల్లి సూరిబాబు, సుంకర శ్రీనివాసరావు, దొంతి శ్రీనివాసరావు, చిత్తా శీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

50 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం



పట్టు పురుగులు

దెందులూరు: మండలం మెట్ట గ్రామాల్లో 50 ఎకరాల్లో పట్టు పురుగుల పెంపకం సాగు చేస్తున్నారని హార్టికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్ టి.రత్తయ్య అన్నారు. సోమవారం రామారావు గూడెంలోని పట్టుపురుగుల పెంపక షెడ్లను ఆయన పరిశీలించారు. సాగు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో రైతుకు షెడ్డు బట్టీలు, ప్లాంటేషన్ మెస్‌లు కలిపి రూ.5 లక్షలు యూనిట్‌గా రుణం మంజూరు చేస్తారన్నారు. ఎస్సీ లబ్ధిదారులకు 90 శాతం సబ్సిడీ మంజూరు చేస్తున్నామన్నారు. సొంత భూమి కలిగి ఉన్న రైతులు మెట్ట గ్రామాల్లో పట్టు పురుగుల పెంపకం చేస్తారన్నారు. దీనికి తోడు జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ.3 లక్షలకు పైగా సబ్సిడీ ఇవ్వడంతో రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు: జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు నిడమర్రు సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్, సిబ్బంది మారుమూల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా నిఘాతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామని చేబ్రోలు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఓపెన్ డ్రింకింగ్, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.